సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 2 । జనవరి । 2024



పోలీసులకు పతకాల పంట

విధి నిర్వహణలో ప్రతిభ చాటిన పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలు ప్రకటించింది. జిల్లాలోని పలువురు ఎంపికయ్యారు. 8లో



బొగ్గు ఉత్పత్తి 80శాతమే...

సింగరేణి వ్యాప్తంగా గత డిసెంబర్‌లో నిర్దేశించిన లక్ష్యంలో 80 శాతం మేర బొగ్గు ఉత్పత్తి మాత్రమే నమోదైంది. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 18°

వాతావరణం

జిల్లాలో మంగళవారం చలి ప్రభావం అధికంగానే ఉంటుంది. తెల్లవారుజామున దట్టమైన పొగ మంచు అలుముకుంటుంది.

అయోధ్య రామయ్యా.. నీ దర్శనమేల

రామజన్మ భూమి అయిన అయోధ్యలో నూతనంగా నిర్మించిన ఆలయాన్ని ఈనెల 22న ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో దశరథ రామయ్యను దర్శించుకునేందుకు వెళ్లే భక్తుల కోసం దేశంలోని అనేక ప్రాంతాల నుంచి అయోధ్యకు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నారు. అయితే ఉమ్మడి జిల్లా వాసులకు రైలు సౌకర్యం లేకపోవడంతో అయోధ్య రాముడిని దర్శించుకోవడం ఎలా అని మథనపడుతున్నారు. ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు రైల్వేశాఖను కోరుతున్నారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- ప్రారంభానికి సిద్ధమైన భవ్య మందిరం
- భక్తుల కోసం దేశవ్యాప్తంగా వెయ్యి ప్రత్యేక రైళ్లు
- జనవరి 19 నుంచి నడిపించనున్న రైల్వేశాఖ
- దక్షిణ అయోధ్య 'భద్రాద్రి' నుంచి లేని రైలు
- ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని జిల్లా వాసుల వినతి

శ్రీరాముడి జన్మస్థానమైన అయోధ్యలో నూతనంగా ఆలయం నిర్మించారు. జానకిరాముడు పుట్టిన చోట వేల ఏళ్ల తర్వాత గుడి ఏర్పాటు కావడంతో దేశవ్యాప్తంగా భక్తులు అయోధ్యకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఈనెల 23 నుంచి ఆలయంలోకి భక్తులకు ప్రవేశం కల్పించనున్నారు. దీంతో దేశం నలుమూలల నుంచి వందకు పైగా రైల్వే స్టేషన్ల నుంచి అయోధ్యకు వెయ్యికి పైగా రైళ్లను ఏప్రిల్ చివరి వరకు నడిపించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి జనవరి 19న ఈ రైళ్లు ప్రారంభమై 22 నాటికి అయోధ్యకు చేరుకునేలా షెడ్యూల్ సిద్ధం చేస్తున్నారు. ప్రయాణికుల తాకిడిని తట్టుకునేలా ఇటీవల అయోధ్య రైల్వే స్టేషన్‌ను ఆధునీకీకరించారు.

మనకో రైలు కావాలి..

ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో శ్రీరాముడంటే అందరికీ గుర్తొచ్చే ఊరు భద్రాచలం. అయోధ్య రాముడి దర్శనానికి వెళ్లే భక్తుల్లో ఎక్కువ మంది భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామిని దర్శించుకుని, తమ ప్రయాణం ప్రారంభించాలని అనుకుంటారు. వీరితో పాటు వేల ఏళ్ల తర్వాత రామజన్మ స్థలంలో సర్వాంగ సుందరంగా సిద్ధమైన ఆలయ దర్శనం కోసం ఎదురు చూసే భక్తులు వేల సంఖ్యలోనే ఉన్నారు. వీరందరి సౌకర్యార్థం రైల్వేశాఖ ప్రకటించబోయే 1000 ప్రత్యేక రైళ్లలో కొన్నింటిని భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), మణుగూరు రైల్వేస్టేషన్ల నుంచి నడిపించాలని భక్తులు కోరుతున్నారు. ఏపీ నుంచి అయోధ్యకు వెళ్లే ప్రత్యేక రైళ్లలో ఖమ్మం, మధిర స్టేషన్లకు రిజర్వేషన్లలో తగు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

తక్కువ ఖర్చు.. సౌకర్యవంతం

అయోధ్య రాముడి దర్శనానికి తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణం అంటే రైలు మార్గమే. ఖమ్మం, భద్రాచలం రోడ్ స్టేషన్‌ల నుంచి సుమారు 1650 కి.మీ.ల దూరంలో అయోధ్య నగరం ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం హైదరాబాద్, కాజీపేట, విజయవాడ వంటి స్టేషన్ల నుంచి రెగ్యులర్ రైళ్లు ఉన్నాయి. వీటికి తోడు ప్రత్యేక రైళ్లను కూడా ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటి వరకు భద్రాచలం నుంచి రైలు నడిపించే విషయంలో ఇటు ప్రజాప్రతినిదులకు, అటు స్టేషన్ సిబ్బందికి ఎలాంటి సమాచారం రాలేదు. ముందుగా రైలును ప్రకటించి షెడ్యూల్ విడుదల చేస్తే దానికి తగ్గట్టుగా ప్రయాణానికి ప్లాన్ చేసుకునే వీలు కలుగుతుందని భక్తులు కోరుతున్నారు.

ఎంపీలు దృష్టి పెట్టాలి..

రైల్వే శాఖ మంత్రిగా బండారు దత్తాత్రేయ పని చేసిన కాలంలో భద్రాచలం రామయ్య విషయంలో ప్రభుత్వ పరంగా ఎంతో చొరవ చూపించేవారు. ముఖ్యంగా శ్రీరామనవమి వంటి సందర్భాల్లో సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ప్రత్యేక రైలును భద్రాచలంరోడ్ వరకు నడిపించేవారు. ఆ తర్వాత కాలంలో ముక్కోటి, శ్రీరామనవమి వంటి పర్వదినాల్లోనూ భద్రాచలానికి ప్రత్యేక రైళ్లు కరువయ్యాయి. కనీసం కరోనా ముందు కాలం నాటి రైళ్లను కూడా పూర్తిగా పునరుద్ధరించలేదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం నుంచి ప్రత్యేకంగా రైలును అయోధ్యకు నడిపించాలని భక్తులు రైల్వేశాఖను కోరుతున్నారు. ఈ దిశగా ఎంపీలు కృషి చేయాలని విన్నవిస్తున్నారు.



పావన భద్రాద్రి

ప్రస్తుతం ఉత్తర్ ప్రదేశ్‌లోని అయోధ్య నగరం శ్రీరాముడి జన్మస్థలం. తండ్రి దశరథుడి ఆదేశాల మేరకు వనవాసం కోసం రాముడు అయోధ్య ను వదిలి గోదావరి తీరంలోని భద్రాచలం పరిసర ప్రాంతాల్లో 14 ఏళ్లపాటు వనవాసం చేసినట్టు పురాణాలు చెబుతున్నాయి. ఈ మేరకు భద్రాచలం పరిసర ప్రాంతాల్లో రామాయణాన్ని గుర్తు తెచ్చేలా పర్ణశాల, దుమ్ముగూడెం, రేఖపల్లి, యటపాక వంటి గ్రామాలు ఉన్నాయి. రాముడి కోసం భద్రాచలంలో నిజాం కాలంలో అప్పటి తహసీల్దార్ కంచర్ల గోపన్న రామాలయం నిర్మించాడు. అప్పటి నుంచి నేటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాదిగా శ్రీరాముడి దర్శనం కోసం భద్రాచలం వస్తుంటారు. హనుమాన్ మాల ధరించిన భక్తులు సైతం కొండగట్టు తర్వాత భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకే ఆసక్తి చూపిస్తారు.

అయోధ్యకు పర్మనెంట్ రైలు కావాలి



అయోధ్య రాముడి దర్శించుకునే అవకాశాన్ని భక్తులకు కల్పించాలి. భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి అయోధ్యకు పర్మనెంట్‌గా రైలును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి షిర్డీ, తిరుపతి వంటి నగరాలకు కూడా రైలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎంతో కాలంగా ఉంది.

– కొదమసింహం పాండురంగాచార్యులు, కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్

పుణ్యక్షేత్రాలకు రైళ్లు ఏర్పాటు చేయాలి



భద్రాచలం – అయోధ్య మధ్య రైలు నడిస్తే భక్తులకు ఎంతో మేలు జరుగుతుంది. రైళ్ల సంఖ్యను పెంచడం వలన కొత్తగూడెం వ్యాపారపరంగా కూడా అభివృద్ధి చెందడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. గత ఏడాది కాలంగా భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి రైళ్ల రాకపోకలు సరిగా జరగడం లేదు.

– మొరిశెట్టి భవానీప్రసాద్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో 'నూతన' సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న డీఎస్పీ

పాల్వంచరూరల్ : మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయానికి నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడగా, భక్తులు క్యూ లైన్ల ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, పాల్వంచ డీఎస్పీ వెంకటేష్, సీఐ వినయ్‌కుమార్, పాలవ్వంచ డివిజన్ ఎస్‌ఐలు అమ్మవారిని దర్శించుకోగా, వేద పండితులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింత నాగరాజు, గంధం వెంగళరావు పాల్గొన్నారు.

రేపు వేలం..

పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలోని ఆరో నంబర్ షాపునకు బుధవారం వేలం నిర్వహించనున్నట్లు ఈఓ రజనీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాప్ దక్కించుకున్నవారు మూడేళ్లపాటు వ్యాపారాలు నిర్వహించుకోవచ్చని, ఆసక్తి గల వారు రూ.200 చెల్లించి టెండర్ వేసి వేలంలో పాల్గొనాలని ఆమె సూచించారు.

సమష్టిగా పనిచేసి ప్రగతి సాధిద్దాం



సీఈని సన్మానిస్తున్న ఉద్యోగులు, కార్మికులు

మణుగూరు రూరల్ : సమష్టిగా పని చేసి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను సాధిద్దామని బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న అన్నారు. ప్లాంట్‌లో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఉద్యోగులు, కార్మికులు బిచ్చన్నను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీటీపీఎస్ అభివృద్ధికి కార్మికులు, ఇంజనీర్లు అంకితభావంతో పని చేయాలని సూచించారు. సంస్థ పురోగతే రాష్ట్ర అభివృద్ధికి మూలమన్నారు. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి ప్రతీ ఒక్కరు అకుంఠిత దీక్షతో పని చేయాలని, తద్వారా బీటీపీఎస్‌ను అగ్ర భాగాన నిలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 1535 యూనియన్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, సిద్దెల హుస్సేన్, బీటీపీఎస్ రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ప్రసాద్, రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీ, వీరబాబు, రవిచంద్రరెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'ఇస్రో' ప్రయోగంలో ఖమ్మం వాసి

ఖమ్మంఅర్బన్: ఇస్రో ప్రతిష్టాత్మకంగా నూతన సంవత్సరం ప్రారంభం రోజైన సోమవారం పీఎస్ఎల్వీ సీ–58 రాకెట్‌ను నింగిలోకి పంపింది. ఈ ప్రయోగంలో ఖమ్మం మధురానగర్‌కు చెందిన శాస్త్రవేత్త వల్లూరి ఉమామహేశ్వరరావు పాలుపంచుకున్నారు. ఆయన పే లోడ్ కార్యకలాపాల ప్రారంభ దశ నమూనా విభాగంలో పనిచేసినట్లు ఉమామహేష్ తండ్రి కోటేశ్వరరావు తెలిపారు. కాగా, ఈప్రయోగంలో మొత్తం 17మంది శాస్త్రవేత్తలు వివిధ విభాగాల నుంచి పాల్గొనగా, అందులో బెంగళూరు కేంద్రంగా విధులు నిర్వర్తిస్తున్న ఉమామహేష్ ఒకరని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

నేటి నుంచి యథావిధిగా గ్రామ సభలు

- కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరుస సెలవుల కారణంగా ఆది, సోమవారాల్లో నిలిచిపోయిన ప్రజాపాలన గ్రామ సభలు మంగళవారం నుంచి ఈ నెల 6 వరకు ప్రజాపాలన గ్రామ సభలు యథావిధిగా నిర్వహించాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆరు గ్యారంటీలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి 2గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామ సభలు నిర్వహించాలని పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతీ దరఖాస్తుకు రశీదు ఇవ్వాలని, రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. రెండు రోజుల సెలవుల తర్వాత గ్రామసభలు నిర్వహిస్తున్నందున దరఖాస్తు చేయడానికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

హోరాహోరీగా నెహ్రూకప్ పోటీలు



అవార్డులు అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న నెహ్రూ కప్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం పీసీసీ పాల్వంచ, మార్నింగ్ స్టార్ భద్రాచలం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పీసీసీ పాల్వంచ జట్టు విజయం సాధించింది. అనంతరం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీసీ లెవన్ పాలవ్వంచ, బ్లాస్టర్స్ లెవెన్ భద్రాచలం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీసీ లెవన్ పాల్వంచ జట్టు 68 పరుగులతో గెలుపొందింది. మొదటి మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును చావా లక్ష్మీనారాయణ, రెండో మ్యాచ్‌లో అజీమ్ గెలుచుకున్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు బాలయోగి, సలీం, నాగార్జున, సదానందం, శ్రీనివాస్, పాషా సలీమ్, గోపి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు వైభవంగా రాపత్తు సేవ

ముత్తంగి రూపంలో అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అధ్యయనోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో చినజీయర్ మఠం ఆధ్వర్యంలో రాపత్తు సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పల్లకీలో స్వామి వారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. కాగా స్వామివారి రాపత్తు సేవలు మంగళవారంతో ముగియనున్నాయి. బుధవారం నుంచి శుక్రవారం వరకు విలాసోత్సవాలు, ఈనెల 8న సాయంత్రం 6 గంటలకు రామయ్యకు బేడా మండపంలో విశ్వరూప సేవ కనులపండువగా జరగనుంది.

ముత్తంగి అలంకరణలో దర్శనం..

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు.

సీఎంను కలిసిన మంత్రి పొంగులేటి



సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని సోమవారం ఉదయం హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పొంగులేటి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు ఉన్నారు.

ఫేక్ సైట్లకు చెక్..

- ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం
- 'వెరిఫైయూఆర్‌ఎల్' యాప్‌నకు రూపకల్పన
- 6 వేలకు పైగా వెబ్‌సైట్ల అడ్రస్‌లు నిక్షిప్తం
- ఫేక్ సైట్ల అడ్రస్, ఐడీలు కనిపెట్టి అలర్ట్ చేస్తున్న యాప్
- చంద్రుగొండ యువకుడి ఆవిష్కరణ

గోపి రూపొందించిన 'వెరిఫైయూఆర్ఎల్' యాప్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు ఓ యువకుడు వినూత్న ఆవిష్కరణకు తెర తీశాడు. తన మెయిల్‌కు వచ్చిన మెసేజ్‌తో మోసపోయిన ఆయన ఇతరులకు అలా జరగొద్దనే భావనతో చేసిన ఆలోచన యాప్ రూపకల్పనకు బాటలు వేసింది. 'వెరిఫైయూఆర్‌ఎల్' పేరిట యాప్ రూపొందించిన ఆ యువకుడు ఇందులో ఆరు వేలకు పైగా వెబ్‌సైట్ల అడ్రస్‌లు, ఐడీలను నిక్షిప్తం చేశాడు. దేశవ్యాప్తంగా ఆర్‌బీఐ అనుమతి పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు, ప్రముఖ షాపింగ్ మాల్‌లు, ఇతర కంపెనీల వెబ్‌సైట్లు ఇందులో ఉన్నాయి. తద్వారా మొబైల్‌కు వచ్చే వెబ్‌సైట్ అడ్రస్‌ను ఈ యాప్ ద్వారా పరిశీలిస్తే అది అధికారికమో, కాదో తేలిపోతుంది. చంద్రుగొండకు చెందిన కడియాల గోపి ఈ యాప్‌కు రూపకల్పన చేయగా పలువురు వినియోగించుకుంటూ భేష్ అంటున్నారు.

తాను మోసపోయి..

ఈ యాప్‌ను రూపొందించిన కడియాల గోపి 2010లో కొత్తగూడెం మైనింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేశాడు. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన ఫైనల్ ఇయర్‌లో ఉండగా మెయిల్‌కు 'రూ.కోటి లాటరీ తగిలింది.. మీరు రూ.25 వేలు చెల్లిస్తే డబ్బులు మీ ఖాతాలో పడుతాయి' అంటూ వచ్చిన మెసేజ్‌కు స్పందించాడు. మెయిల్ పంపిన వ్యక్తి బ్యాంకు ఖాతా నంబర్‌తో పాటు ఫోన్ నంబర్ కూడా ఇవ్వగా రూ.కోటి వస్తాయనే భావనతో గోపి రూ.25 వేలు జమ చేశాడు. ఆ తర్వాత సదరు వ్యక్తికి ఫోన్ చేస్తే డబ్బు తీసుకునేందుకు ముంబై రావాలని సూచించగా, అనుమానం వచ్చిన గోపి ఆ తర్వాత పలుమార్లు ఫోన్ చేయగా స్విచాఫ్ చేశాడు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన గోపి.. అతర్వాత ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నట్లు గమనించాడు. ఈ మేరకు తనలా ఎవరూ మోసపోవద్దనే భావనతో వెరిఫైయూఆర్‌ఎల్ యాప్‌నకు రూపకల్పన చేశాడు.

ఐడీ అసలుదా.. నకిలీదా..

పండుగల ఆఫర్లు, అలాగే ప్రత్యేక రోజుల్లోనే కాక పలు కంపెనీల నుంచి సెల్‌ఫోన్లకు వెబ్‌సైట్ల చిరునామాతో మెసేజ్‌లు సర్వసాధారణమయ్యాయి. తెలిసీ తెలియక ఆయా వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే ఖాతాల్లో ఉన్న డబ్బు కోల్పోయే ప్రమాదముంది. అంతేకాక పలువురు లాటరీ తగిలిందని, కొంత డబ్బు చెల్లించాలంటూ మెసేజ్‌లు పంపిస్తున్నారు. వీటికి స్పందిస్తే లాటరీ మాటేమో కానీ మోసపోవడం జరుగుతోంది. దీంతో మన ఫోన్‌కు వచ్చిన కంపెనీలకు అధికారిక వెబ్‌సైట్ ఐడీనా, కాదా తెలుసుకునేందుకు గోపి రూపొందించిన 'వెరిఫైయూఆర్ ఎల్' యాప్ ఉపయోగపడుతోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి పొంది దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంకులే కాక ప్రముఖ షాపింగ్ మాళ్లు, పలు రాష్ట్రాల అధికార వెబ్‌సైట్లు మొత్తంగా 6 వేలకు పైగా సైట్ల అడ్రస్‌లు, ఐడీలను యాప్‌లో నిక్షిప్తం చేశాడు. మొబైల్‌లో ప్లే స్టోర్‌లోకి వెళ్లి 'వెరిఫైయూఆర్‌ఎల్' యాప్ డౌన్ లోడ్ చేసుకుని, అందులో మన మొబైల్‌కు వచ్చిన వెబ్‌సైట్ ఐడీని పేస్ట్ చేయాలి. అనంతరం సెర్చ్ కొడితే ఈ యాప్‌లో సెర్చ్ చేస్తే ఆ వెబ్‌సైట్ కంపెనీ నుంచి అధికారికంగా వచ్చిందా.. లేదా అనేది తెలిసిపోతుంది.



తాను రూపొందించిన మొబైల్ యాప్‌తో గోపి

అంతా ఉచితమే..

నేను రూపొందించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడమే కాక ఫేక్ సైట్లను గుర్తించే సేవలు కూడా ఉచితంగానే అందుతున్నాయి. ఆన్‌లైన్ మోసాలకు చెక్ పెట్టేలా నావంతు ప్రయత్నంగా రూపొందించిన యాప్‌ను సైబర్ నిపుణుల సూచనలతో మార్పులు, చేర్పులు చేస్తున్నా. అలాగే, దేశంలోని ఇంకా ప్రముఖ కంపెనీలు, ఇతర ప్రభుత్వాల అధికారిక వెబ్‌సైట్ ఐడీలు కూడా సేకరించి యాప్‌లో నిక్షిప్తం చేస్తాను.

– కడియాల గోపి

వాడవాడలా నూతన వేడుకలు..



కేక్ కట్ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



ఎస్పీ కార్యాలయంలో డాక్టర్ వినీత్ తదితరులు..

నూతన సంవత్సర వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాలో పూజలు, చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు చేశారు. కేక్ కటింగ్‌లు, స్వీట్ల పంపిణీతో పాటు పలుచోట్ల బెలూన్లు ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ లోగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. కొత్తగూడెం జిల్లా కోర్టులో జడ్జి పాటిల్ వసంత్ కేక్ కట్ చేయగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.భానుమతి, జూనియర్ సివిల్ జడ్జి బి.రామారావు, మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సుచరిత తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వినీత్ కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్‌పంకజ్, జిల్లా షీటీం ఇంచార్జ్ పి.రమాదేవి పాల్గొన్నారు. – కొత్తగూడెంటౌన్

విద్యుత్ సంస్థ ప్రగతికి కృషిచేయాలి



సీఈ వెంకటేశ్వరరావుతో నాయకులు



సీఈ ప్రభాకర్‌రావుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

పాల్వంచరూరల్: విద్యుత్ సంస్థ ప్రగతి కోసం ప్రతీ ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని కేటీపీఎస్ 5, 6 దశల చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్‌రావు సూచించారు. కొత్త సంవత్సరం సందర్భంగా ప్రభాకర్‌రావుతో పాటు 7వ దశ సీఈ వెంకటేశ్వరరావును తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సోమవారం వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడపాలని సూచించారు. యూనియన్ బాధ్యులు గొర్రె వేణుగోపాల్, కే.వీ.రామారావు, భూక్యా వెంకటేశ్వర్లు, రంజిత్‌కుమార్, వెంపటి వెంకటేశ్వర్లు, ఎస్.శ్రీనివాసాచారి, సత్యరాజ్, స్టీవెన్, సయ్యద్, శివరాం, గోపయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమ్మవారికి వెండి నేత్రాల బహూకరణ



వెండి కళ్లను అర్చకుడికి అందజేస్తున్న భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం బస్టాండ్ ఇన్ గేట్ వద్ద ఉన్న దుర్గాదేవి అమ్మవారికి పట్టణానికి చెందిన కిలారు ప్రకాష్–ఝాన్సీ దంపతులు 5 గ్రాముల వెండి కళ్లను సోమవారం బహూకరించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రి పొంగులేటిని కలిసిన బ్రహ్మయ్య, ఎంపీపీ



మంత్రి పొంగులేటిని సన్మానిస్తున్న తుళ్లూరి బ్రహ్మయ్య, సుజాత

అశ్వాపురం: ఖమ్మంలో క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను సోమవారం డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముత్తినేని శ్రీనివాసరావు, వేములపల్లి రమేష్, షర్ఫియుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

అశ్వారావుపేటరూరల్: ఓ లారీ డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి ఏపీలోని రాజమండ్రి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అశ్వారావుపేటలోని కాకతీయ గేట్ సమీపంలో ఎదురుగా వచ్చి కారును తప్పించే క్రమంలో అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో లారీ ముందుభాగం దెబ్బతినగా, డివైడర్ గోడ రెండు వైపులా సుమారు 3 మీటర్ల వరకు ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడగా, త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

భద్రాచలంటౌన్: చోరీ కేసులో ఓ వ్యక్తిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డ మణుగూరు పట్టణానికి చెందిన లావేటి విమల కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 28 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పూర్తి విచారణ అనంతరం విమల కుమార్ గతంలో ఖమ్మం జిల్లాలో పలు చోరీల కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఏవీఎస్ రావు తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుర్రాల చెరువు గ్రామంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మద్యం తాగి కింద పడిపోయిన ఓ వ్యక్తి విషయంలో మొదలైన వాగ్వాదం ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు గురైంది. స్థానికులు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరు మృతి

మరొకరి పరిస్థితి విషమం



నరసింహారావు మృతదేహం

దమ్మపేట: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దగొల్ల గూడెం గ్రామ శివారులో సోమవారంరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... సోమవారం రాత్రి మండలంలోని అప్పారావు పేట గ్రామానికి చెందిన రేగళ్ల నరసింహారావు (40), వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై పెద్దగొల్లగూడెం గ్రామం నుంచి నల్లగుంట గ్రామం వైపు వెళుతున్నారు. అదే సమయంలో మండలంలోని దిబ్బగూడెం గ్రామానికి చెందిన బుద్ద పుల్లారావు (38) నల్లగుంట గ్రామం నుంచి పెద్దగొల్లగూడెం గ్రామం వైపు మరో ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈ క్రమంలో పెద్దగొల్లగూడెం గ్రామశివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. రేగళ్ల నరసింహారావు అక్కడికక్కడే మృతి చెందగా, బుద్ద పుల్లారావు దమ్మపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటేశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

టీ-హబ్‌లోనే క్షయ నిర్ధారణ

- మూడు ఆస్పత్రుల నుంచి త్వరలోనే వ్యాధి నిర్ధారణ పరికరాల తరలింపు
- 1992 నుంచి భద్రాచలం ఆస్పత్రిలో క్షయ బాధితులకు వైద్యసేవలు
- జిల్లా కేంద్రానికి తరలిస్తే మన్యం ప్రజలకు మళ్లీ తిప్పలే..



భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని అదనపు క్షయ నివారణ కేంద్రం

భద్రాచలంఅర్బన్: 2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం చేపట్టింది. ఈ క్రమంలో జిల్లాలోని భద్రాచలం, పాల్వంచ, ఇల్లెందు ప్రాంతాల్లోని క్షయ నిర్ధారణ పరీక్షా కేంద్రాలను జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్ (టీ-హబ్)లకు తరలించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వం గత అక్టోబర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది.

ఏజెన్సీలో వ్యాధి తగ్గుముఖం

ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో గతంలో క్షయ వ్యాధి ఎక్కువగా ఉండగా, నియంత్రించేందుకు అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1992లో భద్రాచలంలో అదనపు జిల్లా క్షయ వ్యాధి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. 2020లో తెలంగాణ ప్రభుత్వం క్షయ వ్యాధి నిర్ధారణ సౌకర్యాలను మెరుగుపరిచింది. జిల్లాలో ఎంపిక చేసిన 4 ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక సీబీనాట్, ట్రూనాట్ యంత్రాలను ఏర్పాటు చేసింది. ఇందుకోం కేవలం భద్రాచలంలోనే రూ.60 లక్షలు వెచ్చించింది. ఇక్కడి 200 పడకల ఏరియా ఆస్పత్రిలో క్షయ వ్యాధి విభాగానికి ప్రత్యేకంగా 12 పడకలు కేటాయించారు. ఈ విభాగంలో వైద్యులు అందిస్తున్న సేవలకు పలు పురస్కారాలు కూడా దక్కాయి. 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం, వైద్యులు కృషి చేస్తుండగా, గతంతో పోల్చితే ఈ రోగం తగ్గుముఖం పట్టింది.

నాలుగు రాష్ట్రాలకు సేవలు

భద్రాచలం క్షయ ఆస్పత్రిలో జిల్లావాసులతోపాటు సరిహద్దు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలు సేవలు పొందుతారు. ఇప్పటివరకు ఆస్పత్రిలో నెలకు 500 మందికి క్షయ పరీక్షలు చేస్తుండగా, సుమారు 40 మంది బాధితులను గుర్తిస్తున్నారు. ఇంతటి కీలక ప్రాంతం నుంచి పరీక్ష పరికరాలను తరలిస్తే రోగ నిర్ధారణలో జాప్యం జరుగుతుంది. ఫలితంగా ఏజెన్సీ ప్రజలకు ఇబ్బందులు తప్పవు. పరీక్ష పరికరాలు, యంత్రాలనూ తరలిస్తే క్షయ వ్యాధి కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులకూ స్థానచలనం తప్పదన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

తరలిస్తే నిర్ధారణ ఫలితాల్లో జాప్యం

టీబీ కేంద్రాలను జిల్లా కేంద్రాల్లోని టీ-హబ్‌లకు తరలిస్తే అక్కడి నుంచి టీ-హబ్ వాహనాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల నుంచి రక్త, తెమడ నమూనాలను సేకరించనున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న టీబీ కేంద్రాల్లో గంటన్నర వ్యవధిలోనే నిర్ధారణ ఫలితాలు వస్తున్నాయి. తాజాగా చేపట్టే పద్ధతితో పరీక్ష ఫలితాలు రావడానికి రెండు రోజుల వ్యవధి పట్టవచ్చని తెలుస్తుంది. వ్యాధి నిర్ధారణ తర్వాత బాధితులకు నెలవారీగా టీబీ కేంద్రాల్లోనే మందులు అందజేస్తున్నారు. తాజా పద్ధతితో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో ఇంకా స్పష్టత రాలేదు.



క్షయ వ్యాధి నిర్ధారణకు ఉపయోగించే ట్రూనాట్ పరికరం

కేవలం పరికరాలనే తరలిస్తున్నాం



జిల్లాలో ఉన్న పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న టీబీ యూనిట్లలోని యంత్రాలను జిల్లా కేంద్రంలోని టీ-హబ్‌కు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. నిర్వహణకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. వార్డులు ఆయా ఆస్పత్రుల్లోనే ఉంటాయి. కేవలం క్షయ వ్యాధి నిర్ధారణ పరికరాలు మాత్రమే తరలించాలని సర్క్యులర్ వచ్చింది.

– డాక్టర్ శ్రీనివాస్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి

జిల్లా పోలీసులకు పతకాల పంట

22 మందికి కఠిన సేవా, సేవా పతకాలు

కొత్తగూడెంటౌన్: విధి నిర్వహణలో ప్రతిభ చాటిన పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలు ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలోని పలువురు అధికారులు, సిబ్బందికి సేవా, కఠిన సేవా పతకాలు లభించాయి. కఠిన సేవా పతకాలకు ఏఆర్ విభాగం కానిస్టేబుళ్లు అబ్దుల్ రెహమాన్, ఎ.నాగేశ్వరరావు ఎంపికయ్యారు. వీరిద్దరి పోస్టింగ్ ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం ఓఎస్‌డీకి అటాచ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, మణుగూరు, కొత్తగూడెం టూటౌన్, అశ్వారావుపేట, కరకగూడెం, కొత్తగూడెం ట్రాఫిక్, కొత్తగూడెం వన్‌టౌన్, ఆళ్లపల్లి, ములకలపల్లికి చెందిన కానిస్టేబుళ్లు పి.మల్లయ్య, కె.రమేష్, బి.నరేష్, డి.సింహాచలం, బి.నరేష్‌కుమార్, కె.మహేందర్‌రెడ్డి, షేక్ ఉస్మాన్, ఎస్.మధు, జి.రవీందర్ కూడా కఠిన సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఇక సేవా పతకాలకు డీసీఆర్‌బీ ఎస్సై డి.అనంతరాములు, భద్రాచలం టౌన్, దమ్మపేట ఏఎస్సైలు జి.శశిధర్, జి.ప్రతాప్‌రెడ్డి, డీసీఆర్‌బీ, ఏఆర్, దమ్మపేట, అశ్వాపురం, కొమురారం హెడ్‌కానిస్టేబుళ్లు జె.సుధాకర్, సాధు లక్ష్మీనారాయణ, ఎస్.వెంకటేశ్వర్లు, కె.జయరాజు, వి.నాగేశ్వరరావు, వై.శ్రీనివాసరావు, బి.రామారావు, షేక్ ఖాసిం ఎంపికయ్యారు.

భారీగా గంజాయి స్వాధీనం

- వాహనంలో రెండు బీరువాల్లో తరలిస్తుండగా సీజ్
- పరారీలో నిందితుడు మజార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వినీత్ తదితరులు

కొత్తగూడెంటౌన్: పోలీసులు భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఓ వాహనంలో మూడు బీరువాలు తరలిస్తూ, అందులోని రెండింటిలో గంజాయి తీసుకెళ్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. సోమవారం ఎస్పీ డాక్టర్ తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. గత నెల 28న టేకులపల్లి పోలీసులు స్టేషన్ ముందు వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో ఓ వ్యక్తి తన ట్రక్కు వాహనాన్ని సమీపంలోని పెట్రోల్ బంకు వైపు వదిలివేసి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వగా, ఎస్‌ఐ రమణారెడ్డి సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. వాహనంలోని మూడు బీరువాలను గ్యాస్ కట్టర్ ద్వారా తెరిచి చూడగా ఒక బీరువా ఖాళీగా ఉంది. మరో రెండు బీరువాల్లో గంజాయి లభించింది. సుమారు రూ. 30 లక్షల విలువైన 120 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితుడు మజార్ పరారీలో ఉన్నాడు. వాహన రిజిస్ట్రేషన్ కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన మహ్మద్ షకిట్ షాషా పేరు మీద ఉండగా, కొద్ది రోజుల క్రితమే కిరాయికి డ్రైవర్ మజార్‌కు ఇచ్చినట్లు విచారణలో యజమాని తెలిపాడు. కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, పరారీలో ఉన్న మజార్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రమణారెడ్డి, కొమరారం ఎస్సై గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో వ్యక్తికి అస్వస్థత

పోలీసులు కొట్టారని బాధితుడి ఆరోపణ

పినపాక: ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌లో కస్టడీలో ఉన్న వ్యక్తి అస్వస్థతకు గురైన ఘటన సోమవారం జరిగింది. బాధిత వ్యక్తి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎల్సిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన సాంబను ఓ కేసు నిమిత్తం శనివారం అర్ధరాత్రి ఈ.బయ్యారం పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. ఆదివారం అర్ధరాత్రి సైతం స్టేషన్‌లోనే ఉంచారని బాధితుడి బంధువులు ఆరోపిస్తున్నారు. సోమవారం సాయంత్రం సమయంలో బాధితుడికి ఫిట్స్ రావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ మరోసారి ఫిట్స్ రావడంతో వైద్యుల సూచన మేరకు మణుగూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. కాగా తప్పు చేస్తే కేసు నమోదు చేయాలేకానీ, విచారణ పేరుతో కొట్టడం ఎంతవరకు సమంజసం అని బాధితుడు వాపోయాడు. ఈ ఘటనపై ఈ.బయ్యారం సీఐ శివ ప్రసాద్‌ను వివరణ కోరగా.. సాంబను కేసు విషయంలో విచారణకు పిలిచామే తప్ప కొట్టలేదని తెలిపారు.

యువతి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేజర్లకు చెందిన బోళ్ల జ్యోతిక(22) ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన బోళ్ల మన్మధరావు – సరోజిని దంపతుల చిన్న కుమార్తె జ్యోతిక రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మామిడి తోటలో 'కోడి పందేలు!

- భారీగా తరలివచ్చిన పందెంరాయుళ్లు
- ఎస్పీకి ఫిర్యాదు అందడంతో వెలుగులోకి..
- పోలీసులు అడ్డుకోవడంతో మరోచోట పందేలు!

అశ్వారావుపేటరూరల్: కొత్త ఏడాది సందర్భంగా సోమవారం ఓ మామిడి తోటలో భారీగా కోడి పందేలు సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి భారీగా పందెంరాయుళ్లు తరలిరాగా, ఎస్పీకి ఫిర్యాదు అందడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఆసుపాక గ్రామంలో కొందరు గ్రామస్తుల ఆధ్వర్యంలో కొత్త ఏడాది నేపథ్యంలో కోడి పందేలను నిర్వహించేందుకు ఓ పొలాన్ని చదును చేసి, బిర్రులను సిద్ధం చేశారు. సోమవారం ఉదయం నుంచి కోడి పందేలు నిర్వహించేందుకు సిద్ధమవగా, కొందరు వ్యక్తులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో సీఐ కరుణాకర్, ఎస్సై పి.శ్రీకాంత్ ఆసుపాక వెళ్లి కోడిపందేలు జరగకుండా చర్యలు చేపట్టారు. దీంతో ఈ గ్రామంలో కోడి పందేలకు బ్రేక్ పడింది.

ప్రజాప్రతినిధి బంధువు మామిడితోటలో..

పోలీసులు అడ్డుకోవడంతో నిర్వాహకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని కోడి పందేల స్థావరాన్ని అక్కడి నుంచి అశ్వారావుపేట మండలంలోని మామిళ్లవారి గూడెం గ్రామ పంచాయతీ ఊసిర్లగూడేనికి మార్చారు. ఈ గ్రామంలోని ఓ ప్రజాప్రతినిధికి చెందిన సమీప బంధువు మామిడి తోటలో బిర్రులను అప్పటికప్పుడే సిద్ధం చేసి ఉదయం 11గంటలకు కోడి పందేలను సాగించారు. అశ్వారావుపేట, వినాయకపురం, తిరుమలకుంట, ఆసుపాక, నారాయణపురంతోపాటు దమ్మపేట మండలం నుంచి సైతం భారీగా పందెంరాయుళ్లు కోడి పుంజులతో తరలివచ్చారు. ఒక్కో పందెం రూ.20 వేల నుంచి రూ.50వేల వరకు నిర్వహించినట్లు సమాచారం. భారీగా నగదు చేతులు మారినట్లు తెలుస్తోంది. గుండు పట్టాలు, మూడు ముక్కల ఆటతోపాటు పలు జూద క్రీడలను సైతం యథేచ్ఛగా నిర్వహించారు. ఆయా జూద క్రీడలను ఏర్పాటు చేసినందుకు సైతం నిర్వాహకులు వసూళ్లకు పాల్పడ్డారు.

స్థావరాలపై దాడులు చేశాం

కోడి పందేల వ్యవహారంపై ఎస్సై పి.శ్రీకాంత్‌ను 'సాక్షి' వివరణ కోరగా..కోడి పందేలు జరిగినట్లు సమాచారం రావడంతో దాడులు చేశామని తెలిపారు. తాము సిబ్బందితో అక్కడి చేరుకోగా, పందెంరాయుళ్లంతా పారిపోయారని, దీనిపై వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

ములకలపల్లి : మండల పరిధిలోని జిన్నెలగూడెం శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై సోమవారం టాస్క్‌ఫోర్ పోలీసులు దాడి చేశారు. 17 మంది పందెంరాయుళ్లను అరెస్ట్ చేశారు. రూ 43,169 నగదు, 32 ద్విచక్ర వాహనాలు, 17 కోడి పుంజులు, 14 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా మరికొందరు పరారీలో ఉన్నారు. గండిపోలు శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న మరో ఇద్దరిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. రెండు కోడి పుంజులు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐ రాజమౌళి వివరాలు వెల్లడించారు. కాగా ఎస్‌ఐ తమను విచక్షణారహితంగా కొట్టారని కేసులో అరెస్టయిన బండారు తిరుపతిరావు, కనకం వెంకటేశ్వర్లు, వడ్డే సత్యం, సయ్యద్ సైదులు, బాల అప్పారావు, జంపాల శ్రీను ఆరోపించారు. ఎస్సై రాజమౌళిని వివరణగా కోరగా.. తాను చేయి చేసుకోలేదని, కౌన్సెలింగ్ ఇచ్చానని తెలిపారు.

ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు



'కొత్త' పూజలు!

నూతన సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రే కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఇక సోమవారం తెల్లవారుజామునే ఇళ్ల ఎదుట మహిళలు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం కుటుంబాలతో సహా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. దీంతో ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఆలయాలన్నీ కిటకిటలాడాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు



స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు



స్వామి వారి దర్శనం చేసుకుంటున్న యువతులు



ఆలయ ఆవరణలో సెల్ఫీ దిగుతున్న యువతులు



లక్ష్మీ అమ్మవారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

చెరువులో పడి చిన్నారి మృతి



చిన్నారి నాగేంద్ర బాబు (ఫైల్)

దుమ్ముగూడెం : ఆరేళ్ల బాలుడు చెరువులో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని ప్రగళ్లపల్లి పంచాయతీలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పంచాయతీలోని రాయగట్ట గ్రామానికి చెందిన తుర్రం ధర్మయ్య, –సుమిత్ర దంపతులకు ఆరేళ్ల కుమారుడు నాగేంద్ర బాబు ఉన్నాడు. ఆదివారం సాయంత్రం ఇంటికి సమీపంలోని చెరువు వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి బాలుడిని బయటకు తీసే సమయానికే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని సీపీఐ మండల సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు పరామర్శించారు. పరామర్శించిన వారిలో తుర్రం సత్తిబాబు, వంశీ, వీరమ్మ, తాటిపూడి క్రాంతి, బీఆర్‌ఎస్ నాయకులు తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, జుంజురి జయసింహ, జిలకర గంగరాజు, పోడియం సుబ్బారావు, నోముల రామిరెడ్డి ఉన్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

వరికోత యంత్రం దగ్ధం



దగ్ధమవుతున్న వరికోత యంత్రం

సుజాతనగర్: వరికోత యంత్రం దగ్ధమైన సంఘటన సుజాతనగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక శివాలయం సమీపంలో సుజాతనగర్‌కు చెందిన ఓ కౌలు రైతు పొలంలో వరికోత కోస్తుండగా యంత్రంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఇంజన్‌లో మంటలు వ్యాపించగా, గమనించిన స్థానికులు నీళ్లు చల్లి అదుపుచేశారు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించిన కరీంనగర్ జిల్లాకు చెందిన యంత్రం డ్రైవర్ రాజేష్‌కు గాయాలయ్యాయి. కాగా భారీగా నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

కరకగూడెం: మండలంలోని మోతె గ్రామంలో ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన మెంతిని శంకర్ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లోని విద్యుత్ తీగలకు షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు లేచాయి. దుస్తులు, సామగ్రి, ద్విచక్ర వాహనం, రూ. 50 వేల నగదు కాలి బూడిదయ్యాయి. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగింది. గతేడాది భారీ వర్షాల కారణంగా తన పూరిల్లు నేలమట్టవ్వడంతో శంకర్ రేకుల ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నాడు. ఆ ఇల్లు కూడా దగ్ధం కావడంతో కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం ఆదుకుని సహాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీ మోడల్ కాలనీకి చెందిన పాదిలి గౌరి(22)కు ఏపీలోని కృష్ణా జిల్లా నందిగామకు చెందిన గోపీనాథ్‌తో వివాహం జరిగింది. భర్త లారీ డ్రైవర్‌గా కాగా, ఈ దంపతులకు మూడు నెలల బాబు ఉన్నాడు. కాగా భర్త అనుమానంతో వేధిస్తుండగా, తాళలేక కొద్ది రోజుల క్రితమే గౌరి తన పుట్టింటికి వచ్చింది. అయినా సరే భర్త వేధింపులు ఆగలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఆదివారం రాత్రి కుటుంబీకులంతా చర్చికి వెళ్లగా, వారంతా ఇంటికి వచ్చే సరికే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భర్త గోపీనాథ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏపీ విద్యుత్ సంస్థలకు ప్రతిష్టాత్మక అవార్డులు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన విద్యుత్ సంస్థలకు అందించే 'ఫాల్కన్ మీడియా–ఎనర్షియా ఫౌండేషన్'జాతీయ అవార్డులను ఏకంగా మూడింటిని ఏపీ విద్యుత్ సంస్థలు పొందాయి. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఏపీ ట్రాన్స్‌కో)కు 'టాప్ స్టేట్ యుటిలిటీ ఫర్ ఎనర్జీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్'అవార్డు లభించింది. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టుల ప్రచారానికి సంబంధించి దేశంలోనే బెస్ట్ స్టేట్ టాప్ రెన్యూవబుల్ ఎనర్జీ నోడల్ ఏజెన్సీగా న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) అవార్డును కైవసం చేసుకుంది. రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్స్ (పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు బాధ్యత) లక్ష్యాన్ని చేరుకోవడంలోనూ ముందంజలో ఉన్న ఉత్తమ రాష్ట్రంగా ఏపీ విద్యుత్ సంస్థలను అవార్డు వరించింది. డిసెంబర్ 29న ముంబైలో ఈ అవార్డులను అందించారు.



సీఎం నివాసంలో నూతన సంవత్సర వేడుకలు

సాక్షి, అమరావతి/తిరుమల: ముఖ్యమంత్రి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. తాడేపల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు సీఎస్ జవహర్‌రెడ్డితో పాటు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం, ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం, అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానం వేద పండితులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వేద మంత్రోచ్ఛారణలతో ఆశీర్వచనాలు ఇచ్చారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా చావిడిమామిడిలో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



పండుగలా పింఛన్ల పంపిణీ

పెంచిన మొత్తంతో అవ్వాతాతల కళ్లలో వెల్లివిరిసిన ఆనందం

సాక్షి, అమరావతి: కొత్త సంవత్సరంలోనూ ఏపీలో పింఛన్ల పంపిణీ పండుగలా మొదలైంది. తాజాగా పెంచిన మొత్తంతో కలిపి రూ.మూడు వేల చొప్పున ఈనెల పింఛన్ డబ్బులు అందుకున్న అవ్వాతాతల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. ఇప్పటివరకూ ప్రతినెలా ఇచ్చే రూ.2,750 పెన్షన్ మొత్తాన్ని ఈ జనవరి ఒకటి నుంచి రూ.మూడు వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని 8వ తేదీ వరకు మండలాల వారీగా ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. మరోవైపు.. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నుంచి కొత్తగా మరో 1,17,161 మందికి పింఛన్లు మంజూరు చేసింది. దీంతో మొత్తంగా ఈ నెలలో 66.34 లక్షల మందికి రూ.1,968 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

ఆరోగ్య సురక్ష రెండోదశ

- రేపటి నుంచి నగరాలు, పట్టణాల్లో కార్యక్రమానికి శ్రీకారం
- ఆరు నెలల్లో 13,954 శిబిరాల నిర్వహణకు వైద్య శాఖ ప్రణాళిక

నేటి నుంచి గ్రామాల్లో రెండో దశ ప్రారంభం



సాక్షి, అమరావతి: ఏపీలో ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జగనన్న ఆరోగ్య సురక్ష '(జేఏఎస్) రెండో దశ అమలుకు వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధమైంది. నేటి నుంచి గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుండగా వారానికి రెండు రోజుల చొప్పున మంగళ, శుక్రవారాల్లో జేఏఎస్‌ను నిర్వహిస్తారు. ఇక పట్టణాలు, నగరాల్లో రెండో దశ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. తొలిదశలో భాగంగా సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో 50 రోజులపాటు జగనన్న సురక్ష ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. సొంత ఊళ్లలోనే 60 లక్షల మంది ప్రజలకు ప్రభుత్వం ఉచిత వైద్య సేవలందించింది. నిరంతరాయంగా కార్యక్రమాన్ని కొనసాగించడంలో భాగంగా రెండో దశను చేపట్టారు.

ఆరు నెలల్లో 13,954 శిబిరాలు

జేఏఎస్ రెండో దశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆరు నెలల్లో 13,954 సురక్ష శిబిరాలు నిర్వహించేలా వైద్య శాఖ ప్రణాళిక రూపొందించింది. గ్రామాల్లో 10,032, పట్టణాలు, నగరాల్లో 3,922 చొప్పున శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ నెలలో 3,583 శిబిరాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి మండలంలో వారానికి ఒక గ్రామం చొప్పున, మునిసిపాలిటీల్లో వారానికి ఒక వార్డు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలను ఆరు నెలల్లో కవర్ చేసేలా శిబిరాలను నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో స్థానిక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, పారామెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఉంటారు. ప్రజలకు సొంత ఊళ్లలో స్పెషలిస్ట్ వైద్య సేవలందించేందుకు 543 జనరల్ మెడిసిన్, 645 గైనకాలజిస్ట్, 349 జనరల్ సర్జన్, 345 ఆర్థోపెడిక్స్, 378 మంది చొప్పున ఇతర స్పెషలిస్ట్ వైద్యులను, కంటి సమస్యల స్క్రీనింగ్ కోసం 562 మంది పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లను నియమించారు. వైద్య శిబిరాల్లో అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నారు. వైద్య పరీక్షల నిర్వహణకు ఏడు రకాల కిట్లు శిబిరాల్లో అందుబాటులో ఉంటాయి.

చేయి పట్టి నడిపిస్తూ..

వైద్య శిబిరాల ద్వారా సొంతూళ్లలో వైద్య సేవలు అందించడమే కాకుండా అనారోగ్య బాధితులను వైద్య పరంగా ప్రభుత్వం చేయి పట్టుకుని నడిపిస్తోంది. జేఏఎస్ శిబిరాల నుంచి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన రోగులను ఫ్యామిలీ డాక్టర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తారు. వీరు ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందడం కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రయాణ చార్జీల కింద రూ.500 చొప్పున అందజేస్తోంది. రిఫరల్ రోగులను ఆస్పత్రులకు తరలించి అక్కడ ఉచితంగా అన్ని వైద్య సేవలు అందేలా సమన్వయం చేస్తారు. జీజీహెచ్‌లు, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసుల కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఉంటాయి. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం వైద్య పరంగా అండగా నిలుస్తోంది. వీరికి ఉచిత కన్సల్టేషన్‌లతో పాటు కాలానుగుణంగా ఉచితంగా మందులు అందజేస్తోంది.

పేట్రేగిన టీడీపీ-జనసేన మూకలు.. మంత్రి రజిని కార్యాలయంపై రాళ్ల దాడి

గుంటూరులో అర్ధరాత్రి అరాచకం..

- న్యూఇయర్ వేడుకల ముసుగులో ర్యాలీ
- వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా నినాదాలు
- మంత్రి కొత్త ఆఫీసుపై రాళ్ల వర్షం
- అడ్డుకున్న పోలీసులపైనా దౌర్జన్యం.. సెక్యూరిటీ గార్డుపై దాడి



మంత్రి రజిని కార్యాలయంపై జరిగిన రాళ్ల దాడిలో ధ్వంసమైన అద్దాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు ఈస్ట్/సాక్షి, అమరావతి/సత్తెనపల్లి: టీడీపీ, జనసేన మూకలు గుంటూరులో విధ్వంసానికి తెరలేపాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని కొత్త కార్యాలయంపై ఆ మూకలు రాళ్ల దాడి చేశాయి. దీంతో కార్యాలయం అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు చంద్రమౌళినగర్ మెయిన్‌రోడ్డులో మంత్రి రజిని పార్టీ నూతన కార్యాలయాన్ని ఏర్పాటుచేస్తున్నారు. సోమవారం ఉదయం ప్రారంభోత్సవం జరగాల్సి ఉండగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తెలుగుదేశం, జనసేన కార్యకర్తల ముసుగులో కొందరు గూండాలు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వచ్చారు. ముందుగా పార్టీ కార్యాలయం ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నూతన సంవత్సర వేడుకల పేరుతో నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 12 గంటల తర్వాత కేక్ కటింగ్ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా.. తెలుగుదేశం, జనసేన జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ మంత్రి కార్యాలయంపై రాళ్లు రువ్వారు. ఈ సంఘటనలో కార్యాలయం అద్దాలు ధ్వంసమయ్యాయి. కార్యాలయం మొత్తం టీడీపీ రౌడీమూకలు విసిరిన రాళ్లతో నిండిపోయింది. అడ్డుకున్న పోలీసులపై దౌర్జన్యానికి దిగారు. లోపలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వారిని ఆఫీసు సెక్యూరిటీ మాసారపు చిరంజీవి అడ్డుకోబోతే అతనిపైనా దాడిచేశారు. కార్యాలయం ప్రారంభానికి సంబంధించిన ఫ్లెక్సీలను టీడీపీ మూకలు చించివేశాయి. పోలీసులు 30 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో సుమారు వంద మంది పాల్గొన్నట్లు పట్టాభిపురం పోలీసులు నిర్ధారించారు. మిగిలిన వారిపైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

పథకం ప్రకారమే దాడి..

ఈ దాడి పథకం ప్రకారమే జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఎందుకంటే.. మంత్రిని ఇటీవలే గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో చంద్రమౌళినగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ఆమె ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, పశ్చిమ నియోజకవర్గం బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ఆమె విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆమెకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రత్యర్థులు దాడికి దిగినట్లు తెలిసింది.

బీసీ మహిళపై టీడీపీ రౌడీయిజం : మంత్రి రజిని

ఈ ఘటనపై మంత్రి రజిని స్పందిస్తూ.. తన పార్టీ కార్యాలయంపై దాడి టీడీపీ గూండాల అధికార దాహానికి పరాకాష్ట అని మండిపడ్డారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఒక బీసీ మహిళ పోటీచేయడాన్ని చూసి తట్టుకోలేక టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారన్నారు. వారికి ఇప్పటికే ఓటమి భయం పట్టుకుందని.. అందుకే ధ్వంస రచనకు తెరతీశారని ఆమె ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే దాడి జరిగిందన్నారు. వాహనాల ద్వారా బస్తాల్లో రాళ్లు తీసుకొచ్చి పార్టీ కార్యాలయంపై విసిరారని.. ఈ దాడి వెనుక ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. మంత్రి కార్యాలయంపైనే టీడీపీ రౌడీమూకలు దాడులకు పాల్పడ్డాయంటే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటో అర్థంచేసుకోవచ్చన్నారు.

జిల్లా వార్తలు

సింగరేణి ప్రధాన కార్యాలయంలో 'నూతన' వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్లు, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ఎన్వీకే.శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అందరూ నూతనోత్సాహంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో అధికారులు కట్టా బసవయ్య, హన్మంతరావు, కవితానాయుడు, బీఆర్.దీక్షితులు, వెంకటేశ్వరరావు, సామ్యూల్ సుదాకర్, కోడూరి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

28వ తేదీ వరకు రైళ్ల రద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలుచోట్ల మూడో లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నందున ఇప్పటికే పలు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేయగా, ఈ నిర్ణయాన్ని మరికొన్నాళ్లు పొడిగించారు. విజయవాడ నుండి ఖమ్మం మీదుగా నడిచే డోర్నకల్ – విజయవాడ(07755), విజయవాడ – డోర్నకల్ (07756), భద్రాచలం రోడ్ – విజయవాడ(07278), విజయవాడ – భద్రాచలం రోడ్ (07279) ప్యాసింజర్ రైళ్లను ఈనెల 14వ వరకు రద్దు చేస్తున్నట్లు గతంలోనే ప్రకటించారు. అయితే, పనులు పూర్తికాకపోవడంతో 28వ తేదీ వరకు రైళ్ల రద్దు నిర్ణయం అమల్లో ఉంటుందని ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు.

రేపు భద్రాద్రి ఆలయ హుండీ లెక్కింపు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను 3వ తేదీన లెక్కించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమం ఉదయం 8గంటలకు మొదలవుతుందని పేర్కొన్నారు. ఈమేరకు ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఈఓ సూచించచారు.

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి 80శాతమే...



ఓసీలో బొగ్గు వెలికి తీస్తున్న దృశ్యం

- గడచిన తొమ్మిది నెలల్లో 91శాతంగా నమోదు
- రోజువారీగా 70 శాతం దాటని ఉత్పత్తి
- ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మూడు నెలల గడువు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని 24 భూగర్భగనులు, 20 ఓపెన్ కాస్ట్‌గనుల్లో గడచిన డిసెంబర్‌లో నిర్దేశించిన లక్ష్యంలో 80 శాతం మేర మాత్రమే బొగ్గు ఉత్పత్తి నమోదైంది. మొత్తంగా 78,10,762 టన్నుల లక్ష్యానికి గాను 62,73,897 టన్నుల బొగ్గు వెలికితీయగలిగారు. ఇందులో ఓపెన్ కాస్ట్ గనుల్లో 70,88,462 టన్నుల లక్ష్యానికి 57,41,603.81, భూగర్భగనుల్లో 7,22,300 టన్నుల లక్ష్యానికి 5,32,294 టన్నుల ఉత్పత్తి నమోదైంది. ఇదిలా ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలలు ముగియగా ఇప్పటివరకు 54.13 మిలియన్ టన్నుల లక్ష్యానికి 49.46 మిలియన్ టన్నులు సాధించిన సంస్థ సుమారు 5 మిలియన్ టన్నుల వెనుకంజలో ఉంది. కాగా, సంస్థ 75 మిలియన్ టన్నుల వార్షిక లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, రోజుకు సగటున 3.10 లక్షల టన్నులకు బదులు 2.10 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదవుతోంది.

మిగిలిన మూడు మాసాలే కీలకం

సింగరేణి సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే, తొమ్మిది నెలల కాలంలో 54.13 మిలియన్ టన్నుల లక్ష్యానికి 49.46 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి నమోదైంది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మూడు నెలలు సమయం ఉన్నందున కీలకంగా వ్యవహరిస్తే తప్ప లక్ష్యసాధన సాధ్యం కాదని చెబుతున్నారు.

నాలుగు ఏరియాల్లోనే వంద శాతం

డిసెంబర్‌లో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో కేవలం నాలుగు ఏరియాల్లోనే ఉత్పత్తి వంద శాతం దాటింది. బెల్లంపల్లి ఏరియాలో 135 శాతం, ఆర్జీ–2లో 104, మణుగూరు 102, ఇల్లెందు ఏరియా 100శాతం ఉత్పత్తి సాధించాయి. ఇక కొత్తగూడెం ఏరియాలో 69 శాతం, మందమర్రిలో 87శాతం, శ్రీరాంపూర్‌లో 89శాతం, ఆర్జీ–1లో 93 శాతం, ఆర్జీ–3లో 91శాతం, ఆడ్రియాలలో 96 శాతం, భూపాలపల్లి ఏరియాలో 67 శాతం ఉత్పత్తి నమోదైంది. అలాగే, గడిచిన తొమ్మిది నెలల్లో బెల్లంపల్లి ఏరియా 130 శాతం ఉత్పత్తి సాధించగా, ఇల్లెందులో 121, మణుగూరు ఏరియా 117 శాతం ఉత్పత్తి సాధించాయి.

ఆదర్శంగా బెల్లంపల్లి ఏరియా



నెలవారీ ఉత్పత్తిలో 135శాతం, వార్షిక ఉత్పత్తిలో 130శాతం, రోజువారీ ఉత్పత్తిలో 120శాతంతో బెల్లంపెల్లి ఏరియా అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈమేరకు అన్ని ఏరియాల అధికారులు బెల్లంపల్లిని ఆదర్శంగా తీసుకుని బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలి. తద్వారా లక్ష్య సాధన సులువవుతుంది. –ఎన్.బలరామ్ సింగరేణి డైరెక్టర్(పా)

జమలాపురానికి పోటెత్తిన భక్తులు

- ఒకేరోజు 30 వేల మంది దర్శనం
- టికెట్ల అమ్మకంతో రూ.5.41లక్షల ఆదాయం



స్వామిని దర్శించుకున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం ప్రారంభం రోజున దాదాపు 30వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈమేరకు అంతరాలయ దర్శనం, లడ్డూ ప్రసాదాల విక్రయం, వాహన పూజలు, కేశ ఖండన టికెట్ల ద్వారా రూ.5.41లక్షల ఆదాయం లభించిందని ఆలయ బాధ్యులు తెలిపారు. కాగా, ఆలయ అర్చకులు వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవతో పాటు ప్రత్యేక పూజలు, శ్రీవారికి పల్లకీ సేవను నిర్వహించారు. అనంతరం భక్తులు బారులుదీరి స్వామిని దర్శించుకోవడంతో గోవింద నామస్మరణతో మార్మోగింది. కాగా, జమలాపురానికి చెందిన వ్యాపారి తుళ్లూరి కోటేశ్వరరావు–నిర్మల దంపతులు ప్రసాద వితరణ చేయగా, శ్రీవేంకటేశ్వర సేవా సమితి, మధిరకు చెందిన సత్యసాయి సేవా సమితి కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, మధిర సీఐ జె.వసంత్‌కుమార్, ఎస్ఐ ఎం.సురేష్, ఆలయ ముఖ్య అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో మంత్రి పొంగులేటి



రాఘవరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, కుటుంబీకులు, నాయకులు

కల్లూరు: తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం తన స్వగ్రామమైన కల్లూరు మండలంలోని నారాయణపురం వచ్చారు. ఈసందర్భంగా మంత్రి తండ్రి రాఘవరెడ్డి వర్ధంతి నిర్వహించగా, ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులర్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి – మాధురి, ఆయన సోదరుడు ప్రసాదరెడ్డి – శ్రీలక్ష్మి దంపతులతో పాటు మంత్రి తల్లి స్వరాజ్యం, ఇతర కుటుంబ సభ్యులు హాజరయ్యారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, నాయకులు మట్టా దయానంద్, బొర్రా రాజశేఖర్, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మువ్వా విజయ్‌బాబు, ఐలూరి రవీందర్‌రెడ్డి, భాగం ప్రభాకర్‌చౌదరి, ఏనుగు సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

భగవంతుడు.. కాలస్వరూపుడు

ప్రవచనకర్త సీతారామానుజాచార్య స్వామి



ప్రవచనాలు వినిపిస్తున్న సీతారామానుజాచార్య స్వామి

సత్తుపల్లిరూరల్: కాలస్వరూపుడైన భగవంతుడు చల్లగా చూస్తుండడంతోనే అందరూ ఆయురారోగ్యాలతో ఉంటున్నారని ప్రముఖ ప్రవచనకర్త నల్లాన్ చక్రవర్తుల సీతారామానుజాచార్య స్వామి తెలిపారు. టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యాన సత్తుపల్లి మండలం రేజర్లలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆయన సోమవారం తిరుప్పావై సందర్భంగా ప్రవచనాలు చేశారు. గోదాదేవి కాలస్వరూపుడైన భగవంతుడిని ఎలా కొలవాలి, ఎలా ఆరాధించాలో లోకానికి తెలియచేసిందని తెలిపారు. ఆ తల్లి చేసిన ఉపకారానికి రుణపడి ఉండాలని చెప్పారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ గొర్ల చెన్నారెడ్డి, ధర్మకర్తలు బొల్లారెడ్డి వసంతలక్ష్మి, ఒగ్గు పుల్లారెడ్డి, భీమిరెడ్డి నరసింహారెడ్డి, కృష్ణస్వామి, రాంబాబు, శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకేరోజు రూ.77,250 ఆదాయం

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన పాల్వంచ మండలం కిన్నెరసానికి నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా సోమవారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి సైతం పర్యాటకులు కుటుంబాలతో సహా వచ్చారు. ఈసందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించడమే కాక బోట్ షికారు చేశారు. కాగా, 1,555 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.52,198, 400మంది బోటుషికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.25,060 ఆదాయం లభించింది.



బోటింగ్ చేస్తున్న జడ్జి సుచిత్ర

సందర్శించిన జిల్లా జడ్జి

నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని కొత్తగూడెం జిల్లా కోర్టు ఫస్ట్‌క్లాస్ జడ్జి సుచిత్ర సందర్శించారు. డీర్‌పార్కులోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించిన తర్వాత బోట్ షికారు చేశారు.